మంచిగా ఆలోచించు
మంచిగా మాట్లాడు
మంచి పని చెయ్యి
ఎందుకంటే
నువ్వు ఏమి చేస్తావో
అదే తిరిగి నీదగ్గరికి
మంచిగా వస్తుంది

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

## మత్తు వీడండి.. నవ జీవితాన్ని ప్రారంభించండి



04

సంపుటి : 02 సంచిక : 232 హైదరాబాద్, ఏప్రిల్, ఆదివారం 12, 2026 పేజీలు : 06 వెల : 3.00

## బెంగాల్‌లో మార్పు ఖాయం

ఎన్నికల ప్రచారంలో మోడీ
టీఎంసీపై విరుచుకుపడ్డ ప్రధాని
జనసంద్రం ఫలితాలకు
సంకేతమని వెల్లడి
ఐదేళ్ల పాలనపై అవినీతి
ఆరోపణలు
బీజేపీ వస్తే శ్వేత పత్రం
విడుదలకు హామీ
మహిళలకు నెలకు రూ.3 వేల
ఆర్థిక సహాయం
రైతులకు మద్దతు, పీఎం
కిసాన్ విస్తరణపై హామీ
అక్రమ చొరబాట్లపై కఠిన
వైఖరి ప్రకటించిన మోడీ
యువత, ఉద్యోగుల కోసం
ప్రత్యేక ప్రకటనలు
ఆరోగ్య రంగంలో
ఆయుష్మాన్ భారత్ అమలు



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయ వాతావరణం మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన భారీ బహిరంగ సభ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. వేలాది మంది ప్రజలు హాజరైన ఈ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఎన్నికల పోరుకు కొత్త ఊపునిచ్చాయి. సభకు హాజరైన జనసందోహాన్ని ఉద్దేశించి మాట్లాడిన మోదీ, ఈ భారీ ..మిగతా 2లో

## జీసీసీల గమ్యస్థానంగా హైదరాబాద్

జీసీసీల కోసం
పెరుగుతున్న ఆకర్షణ
హైదరాబాద్‌పై
అంతర్జాతీయ సంస్థల దృష్టి
టాలెంట్, మౌలిక
వసతులే ప్రధాన బలం
ఫైనాన్స్ రంగ కంపెనీలకు
పెరుగుతున్న ఆసక్తి
పికో టెక్నాలజీ
ప్రతినిధులతో కీలక భేటీ
భవిష్యత్ అవసరాలకు
ముందస్తు ప్రణాళికలు
బెంగళూరు, ముంబయితో
పోల్చిన మంత్రి శ్రీధర్ బాబు
రహదారి అభివృద్ధికి
భారీ ప్రాజెక్టులు
రింగ్ రోడ్లు,
డబుల్ డెక్కర్ రోడ్ల నిర్మాణం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ నగరం ప్రధాన కేంద్రంగా మారుతున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ముఖ్యంగా గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునే పెద్ద ఫైనాన్స్ సంస్థలు హైదరాబాద్‌ను ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని వెల్లడించారు. నగరంలో అందుబాటులో ఉన్న నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక వసతులు, తక్కువ ట్రాఫిక్ ఒత్తిడి, తగిన అద్దెలు వంటి అంశాలు సంస్థలను ఆకర్షిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పికో టెక్నాలజీ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంతో సమావేశమయ్యారు. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ..మిగతా 2లో

## నారీ శక్తిదే రాజ్యం

మహిళా రిజర్వేషన్ బిల్లుకు
ఏకగ్రీవ మద్దతు అవసరం
రాజకీయాలకు అతీతంగా
మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి
స్త్రీలు గౌరవించబడే చోటే
దేవతలు కొలువై ఉంటారని స్పష్టం
భారత రాజకీయాల్లో కొత్త నాంది
ఎంపీ డీకే అరుణ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో.. అక్కడ దేవతలు కొలువై ఉంటారని నమ్మే సంప్రదాయం భారతదేశ సంప్రదాయమని ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ..మిగతా 2లో



## రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు

పేదల భూములను అరాచకంగా
లాక్కుంటున్నారని ఆరోపణ
కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం
అధికార దుర్వినియోగం చేశారని వ్యాఖ్య
అధికారం శాశ్వతం కాదని హెచ్చరిక
అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న
ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు
ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ కార్యకర్తల
సమావేశంలో పాల్గొన్న కేటీఆర్
ప్రజాస్వామ్యాన్ని
దెబ్బతీసే చర్యలు నిలవవని హెచ్చరిక
బీఆర్ఎస్ బలంగా
నిలుస్తుందనే నమ్మకం ఉందన్నారు

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేద ప్రజల భూములను అరాచకంగా లాక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్..... మిగతా 2లో



## అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు

ఐలాపూర్‌లో భారీ కూల్చివేతలు
ప్రభుత్వ భూ రక్షణకు భారీ ఆపరేషన్
కోర్టు ఆదేశాలను పక్కనపెట్టి చర్యలు
గెస్ట్ హౌస్,
ఆరు అంతస్తుల భవనం నేలమట్టం
ఘర్షణలు నివారించేందుకు భారీ
పోలీసు బందోబస్తు
పేదల ఇళ్లకు
హాని లేకుండా జాగ్రత్తలు
వేల కోట్ల విలువైన
భూముల పరిరక్షణ లక్ష్యం
భూకబ్జాలపై
కమిషనర్ రంగనాథ్ వివరణ
కూల్చివేతలపై స్థానికుల ఆనందం, మద్దతు



03

## జీవన్ రెడ్డి చేరికకు ముహూర్తం ఫిక్స్



### కేసీఆర్ ను ఇప్పటికే కలిసిన జీవన్ రెడ్డి

బీఆర్ఎస్ లో చేరికపై స్పష్టమైన సంకేతాలు
ఈ నెల 20న జగిత్యాలలో భారీ బహిరంగసభ..
కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్
కండువా కప్పుకోనున్న జీవన్ రెడ్డి


**హైదరాబాద్, (డిడి9 వార్త):**
జగిత్యాలలో ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ కోసం గులాబీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధమవుతున్నాయి. సుమారు లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సభకు సంబంధించి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేసేందుకు ఈరోజు పార్టీ ముఖ్య నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వసంత ..మిగతా 2లో

## జీవన్ రెడ్డి నిర్ణయం సరికాదు...

కాంగ్రెస్‌లో జీవన్ రెడ్డికి
గౌరవం ఉంది
సీనియర్ నాయకుడి
ఇలాంటి నిర్ణయం ఆశ్చర్యకరం
చిన్న స్థానిక సమస్యల కోసం
పార్టీ విడిచిపెట్టడం తగదు
దశాబ్దాల అనుబంధాన్ని
విరమించడం తప్పు
గతంలో మాజీ సీఎం
చంద్రశేఖర్‌రావుపై పోరాటం
ఇప్పుడు ఆయనతో కలవడం
ప్రజల్లో చర్చనీయాంశం
నిర్ణయాన్ని
పునరాలోచించుకోవాలని సూచన
తిరిగి వస్తే రాజకీయ
భవిష్యత్తుకు మంచిదని అభిప్రాయం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరాలని తీసుకున్న నిర్ణయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ జెండా మోసిన ఆయన, కేవలం స్థానికంగా ..మిగతా 2లో



## మైక్రో ఫైనాన్స్ మోసం కేసులో మంగ్లీ

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
రూ.10 కోట్ల పెట్టుబడి మోసం ఆరోపణలు
గాయని మంగ్లీతో పాటు నలుగురిపై కేసు నమోదు
మైక్రో ఫైనాన్స్ పేరిట పెట్టుబడులు సేకరణ
ఇన్‌ఫ్రా కంపెనీ పేరుతో నిధుల సేకరణ ఆరోపణలు
బాధితుల ఫిర్యాదుతో న్యాయవాది ముందుకు
కేసు నుంచి తప్పించుకునేందుకు డబ్బు ఆఫర్ ఆరోపణ
బెదిరింపులు, దౌర్జన్యాలపై పోలీసులకు ఫిర్యాదు
బీఎన్ఎస్ చట్టాల కింద దర్యాప్తు కొనసాగింపు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైదరాబాద్‌లో మైక్రో ఫైనాన్స్ పేరుతో కోట్ల రూపాయల మోసం జరిగిందన్న ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ కేసులో ప్రముఖ సినీ ..మిగతా 2లో

## హామీలు చాలానే... నియామకాలు ఎప్పుడూ?



03

నామినేటెడ్ పదవుల పంపకాలపై
నిరంతర వాయిదాలు
"అదిగో ఇదిగో" అంటూ
గడువు పెడుతున్నారనే విమర్శ
పదవులు వస్తాయో లేదో
కూడా స్పష్టత లేకపోవడం
వారం, పది రోజుల్లో ఇస్తామని
చెప్పి రెండేళ్లు ఆలస్యం
జిల్లాల వారీగా
ఇన్చార్జిలతో జాబితాలు సిద్ధం
అయినప్పటికీ భర్తీ
మాత్రం పెండింగ్‌లోనే
16–17 కార్పొరేషన్
పోస్టులు భర్తీ చేస్తామని హామీ

# బెంగాల్‌లో మార్పు ఖాయం

మొదటిపేజీ తరువాయి



స్పందన రాబోయే ఎన్నికల ఫలితాలకు సంకేతమని వ్యాఖ్యానించారు. ప్రజల్లో మార్పు కోరిక స్పష్టంగా కనిపిస్తోందని ఆయన అన్నారు.

సభ జరిగిన ప్రాంతంలో కనిపించిన ఉత్సాహం, ప్రజల పాల్గొనడం సాధారణ విషయం కాదని మోదీ పేర్కొన్నారు. ఇది భయం మీద నమ్మకం గెలుస్తుందనే సూచన అని అన్నారు. గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని, అదే ఇప్పుడు పెద్ద సంఖ్యలో ప్రజలు సభలకు రావడానికి కారణమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితులు రాష్ట్రంలో మార్పుకు దారి తీస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.టీఎంసీ ప్రభుత్వంపై ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. గత పదిహేనేళ్లలో రాష్ట్రంలో అవినీతి పెరిగిందని, ప్రభుత్వ వ్యవస్థలు బలహీనపడ్డాయని ఆరోపించారు. ప్రజల నిధులు సరైన విధంగా వినియోగం కాలేదని, కొన్ని వర్గాలకు మాత్రమే ప్రయోజనం చేకూరిందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ అవినీతి వ్యవహారాలపై పూర్తి వివరాలు బయటపెడతామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రత్యేకంగా వైట్ పేపర్ విడుదల చేస్తామని తెలిపారు.

మహిళల సంక్షేమాన్ని ప్రధానంగా ప్రస్తావించిన మోదీ, బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ప్రతి మహిళకు నెలకు రూ.3000 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. మహిళలు భయపడకుండా జీవించేలా భద్రతా వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఘటనలను ప్రస్తావిస్తూ, భద్రతా పరిస్థితిని మెరుగుపరచడం తమ ప్రాధాన్యమని అన్నారు.

రైతుల సమస్యలపై కూడా ప్రధాని స్పందించారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ముఖ్యంగా పంటల ధరల సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే రైతులకు కేంద్ర పథకాల ప్రయోజనాలు పూర్తిగా అందేలా చూస్తామని తెలిపారు. పీఎం కిసాన్ పథకం కింద ఆర్థిక సహాయం పెంపు, కనీస మద్దతు ధర అమలు, వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అక్రమ చొరబాట్ల అంశంపై మోదీ కఠిన వైఖరి వ్యక్తం చేశారు. దేశ భద్రతకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని చెప్పారు. అక్రమంగా దేశంలోకి వచ్చిన వారిని వెనక్కి పంపిస్తామని హెచ్చరించారు. వారికి సహకరించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పౌరసత్వ అంశాన్ని ప్రస్తావిస్తూ, కొన్ని వర్గాలకు న్యాయం చేస్తామని చెప్పారు.యువతకు ఉపాధి అవకాశాల విషయంలో కూడా కీలక హామీలు ఇచ్చారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వయోపరిమితి కారణంగా నష్టపోయిన వారికి సడలింపులు ఇవ్వడం, ప్రభుత్వ ఉద్యోగాలలో మార్పులు తీసుకురావడం వంటి చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సంఘం అమలు చేస్తామని కూడా హామీ ఇచ్చారు.

ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన మోదీ, బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇది కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. మొదటి కేబినెట్ సమావేశంలోనే ఈ నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.అవినీతి ఆరోపణలు, సంక్షేమ హామీలు, భద్రతా అంశాలు వంటి కీలక విషయాలపై మోదీ చేసిన వ్యాఖ్యలు ఎన్నికల వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. రాబోయే పోలింగ్ ముందు ఈ ప్రసంగం ఓటర్లపై ఎంత ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది. బంగాల్ రాజకీయాల్లో ఇది కీలక మలుపు కావచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# జీసీసీల గమ్యస్థానంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పికో టెక్నాలజీ సంస్థ హైదరాబాద్‌లో తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేసింది.సమావేశంలో నగరంలోని మౌలిక వసతులు, పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి మంత్రి వివరించారు. ఫైనాన్షియల్ మార్కెట్లకు సంబంధించిన సేవలు అందించే సంస్థలు ఇక్కడ విస్తరణకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఈ రంగంలో మరిన్ని కంపెనీలు హైదరాబాద్ వైపు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

రానున్న 5 నుంచి 10 సంవత్సరాలు మాత్రమే కాకుండా, 20 సంవత్సరాల దృష్టితో కూడా నగర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఐటి, పరిశ్రమల విస్తరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.

బెంగళూరు, ముంబయి నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో కార్యాలయాల వినియోగం అధికంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ ఆక్యుపెన్సీ రేటు సుమారు 70 శాతానికి పైగా ఉండగా, ముంబయిలో అది తక్కువగా ఉందని వివరించారు. ట్రాఫిక్ సమస్యలు, వాయు కాలుష్యం వంటి సమస్యల కారణంగా ఇతర మెట్రో నగరాల్లో ఉన్న సంస్థలు హైదరాబాద్ వైపు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు.

ఇక నగర మౌలిక వసతుల అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వివరాలు వెల్లడించారు. ఇప్పటికే ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు మరింత విస్తరణగా రీజనల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా నగర రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రింగ్ రోడ్లకు అనుసంధానంగా రేడియల్ రోడ్లను కూడా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. వీటి ద్వారా నగరానికి బయట నుంచి లోపలికి, లోపల నుంచి బయటకు రవాణా సులభతరం అవుతుందని చెప్పారు. అదనంగా



రైలు మార్గాలను కూడా అభివృద్ధి చేస్తూ నగరాన్ని ప్రపంచ స్థాయి రవాణా కేంద్రంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

హయత్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వరకు డబుల్ డెక్కర్ రోడ్డును నిర్మించే ప్రణాళికపై కూడా మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టులో కింద భాగం స్థానిక ట్రాఫిక్ కోసం, పైభాగం దీర్ఘదూర రవాణా కోసం ఉపయోగపడేలా రూపొందిస్తున్నట్లు చెప్పారు. దేశంలో అరుదుగా కనిపించే ఈ రకమైన రహదారి నిర్మాణం హైదరాబాద్‌లో చేపట్టడం ప్రత్యేకమని అన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.హైదరాబాద్ నగరం అంతర్జాతీయ కంపెనీలకు కేంద్రంగా ఎదుగుతూ, భవిష్యత్తులో మరింత పెట్టుబడులను ఆకర్షించే దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వం చేపడుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అనుకూల వ్యాపార వాతావరణం కలిసి నగరాన్ని గ్లోబల్ మ్యాప్‌పై మరింత బలంగా నిలబెడుతున్నాయి.

# 'నారీ శక్తి'దే రాజ్యం

మొదటిపేజీ తరువాయి

ఆమె మీడియాతో మాట్లాడారు. ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టబోతున్నారు. మహిళా సంక్షేమనికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. నారీ శక్తి వందన్ అధినియం చట్టాన్ని తీసుకువచ్చి మహిళలకు 33 రిజర్వేషన్ కల్పించాలని చిత్తశుద్ధితో ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు వెళ్తున్నారు. 2029 సాధారణ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని పార్లమెంట్ సమావేశాలు ఏప్రిల్ 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఎవరు చేయని పని మోడీ చేస్తున్నారు. ఎన్నో ఏళ్ళు పాలించిన కాంగ్రెస్ కూడా చేయలేకపోయింది. బిల్లు అమలు చేసినప్పుడే ఆ బిల్లుకు సార్థకత. పార్లమెంట్ సమావేశాల్లో అన్ని పార్టీల సభ్యులు పార్టీలకు అతీతంగా మహిళా రిజర్వేషన్ బిల్లును మద్దతు తెలపాలి. 2029లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి వచ్చేలా సహకరించాలి. ఇది ఒక సాధారణ బిల్లు కాదు. కోట్లాది మంది ఆడబిడ్డల ఆశయం. ఈ బిల్లు రాజకీయాల్లో కొత్తనాంది.

**అభివృద్ధి వైపు అడుగులు..**

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు అయితే.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత.. పార్లమెంట్ స్థానాలు 17 స్థానాల నుంచి 26 స్థానాలకు పెరుగుతాయి. అందులో 9 మంది ఎంపీలు తెలంగాణ నుంచి ఉంటారు. 273 మంది మహిళలు దేశవ్యాప్తంగా పార్లమెంట్‌కి వస్తారు. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 180కి పెరుగుతాయి. అందులో 60 మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో కూర్చునే అవకాశం దక్కుతుంది. అసెంబ్లీ, పార్లమెంట్ చట్టసభల్లో పెద్ద సంఖ్యలో మహిళల ప్రతినిధ్యం పెరుగుతుంది. దేశ రాజకీయాల్లోకి మహిళలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం కల్పిస్తోంది. గతంలో వంటింటికి పరిమితమైన మహిళలు.. అనేక రంగాలలో వచ్చిన అవకాశాలను తన శక్తిని నిరూపించుకుంది. దేశ రాజకీయాల్లో అనేక మార్పులు వస్తాయి. పెద్ద ఎత్తున అభివృద్ధి వైపు అడుగులు వేయగలుగుతాం. ఒక తల్లిగా కుటుంబాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకెళ్లడంలో సమర్థవంతంగా, చక్కగా వ్యవహరిస్తూ.. ముందుకు వెళ్తోంది. చట్ట సభలో మహిళల సంఖ్య పెరిగితే మహిళా ఆర్థిక, ఉపాధి, రక్షణలలో కీలక మార్పులు వస్తాయి. అనేక మంది మహిళలు రాజకీయాల్లో తమ నాయకత్వాన్ని రుజువు చేసుకున్నారు. ఏ రంగంలో అయినా రాణించగలం అని రుజువు చేస్తున్నారు. 40 ఏళ్లుగా మహిళా సాధికారత అని ప్రగల్భాలు కాంగ్రెస్ పలికింది. కనీసం ఇప్పుడైనా మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు తెలుపాలి. మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకోవాలని అనేక మంది కుట్రలు పన్నుతున్నారు. మహిళల గౌరవం పెంచేలా అన్ని రకాలుగా ప్రధాని మోడీ కృషి చేస్తున్నారు. ప్రధాని అయిన నాటినుంచి అనేక కార్యక్రమాలు చేస్తున్నారు.

**పేద కుటుంబాల్లో గుణాత్మక మార్పు..**

మహిళల ఆత్మగౌరవం పెంచేలా.. స్వచ్ భారత కింద 12వేల కోట్ల ఇండ్లకు టాయిలెట్స్ నిర్మాణం చేయించారు. పేద మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ అందించడం జరిగింది. జన్ ధన్ యోజన, స్టార్టాప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు ముద్ర రుణాలు అందిస్తున్నారు. వికాసిత్ భారత్ 2027 లక్ష్యం తో ముందుకు వెళ్తున్నాం. దేశ GDP పెరుగుతుందని అంటే.. మహిళల భాగస్వామ్యం కీలకం. మహిళా శక్తి కి రాజకీయ శక్తి తోడైతే.. గ్రామీణ ప్రాంతాల్లో,రైతు, పేద కుటుంబాల్లో గుణాత్మక మార్పు వస్తుంది. ప్రపంచ దేశాల్లో అభివృద్ధి చెందిన దేశంగా నిలబడాలి అంటే.. మహిళాల భాగస్వామ్యం అవసరం. మహిళలను విద్య,ఆరోగ్యం,ఉపాధి, రక్షణ అన్నింటిలో ప్రోత్సాహకం కల్పిస్తుంది నరేంద్ర మోడీ ప్రభుత్వం. గర్భిణీ, బాలింతల కు పోషకాహారం అందిస్తుంది. క్యాన్సర్ బారిన కడకుండా..



వాక్సినేషన్ బాలికలకు అందిస్తుంది. బీజేపీకి పేరువస్తుందని.. ప్రత్యర్థులు కుళ్ళు బుద్ధితో అడ్డుకునే ప్రయత్నం చేయకుండా ఈ బిల్లుకు సహకరించాలి. మహిళలకు డ్రోన్ ట్రైనింగ్, స్టాండప్ ఇండియా కింద ప్రోత్సహిస్తుంది, దీదీ లక్పతి పథకం ఇలా అనేక పథకాలతో ప్రోత్సహిస్తుంది. మహిళలను గౌరవించే దేశం ఇది. ఈ బిల్లుకు అడ్డు పడకండి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్‌లలో బీజేపీకి క్రెడిట్ వస్తుందని ఏది వాడితే అదీ మాట్లాడుతున్నారు. గతంలో కేసీఆర్ మాదిరి ఉత్తర, దక్షిణ రాష్ట్రాలని.. మాట్లాడారో అలాగే రేవంత్ రెడ్డి కూడా మాట్లాడుతున్నారు. అన్ని రాష్ట్రాల్లో జరిగినట్లు.. తెలంగాణలో సీట్ల పెంపు జరుగుతుంది. మహిళా బిల్లుకు అందరూ మద్దతు తెలుపుతూ.. మహిళలు, పురుషులు, యువత అందరి చిన్న వీడియో చేయాలి. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవన్నీ ఎందుకు గుర్తుకు రాలేదు.. ఇప్పుడే అందుకు మాట్లాడుతున్నారు. టీవీలలో బ్రేకింగ్ న్యూస్‌ల కోసం రేవంత్ రెడ్డి అలా మాట్లాడుతున్నారని డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు.

# జీవన్ రెడ్డి చేరికకు ముహూర్తం ఫిక్స్

మొదటిపేజీ తరువాయి

తదితరులు కలిసి జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానం, ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని కాలేజీ గ్రౌండ్, మోతే రోడ్డు ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు.

ఈ బహిరంగ సభకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడటానికి ప్రధాన కారణం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో మాజీ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా పార్టీలో చేరనుండటమే. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చితే ఈ రెండేళ్లలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ భారీ సభ ద్వారా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును మరోసారి నిరూపించుకోవాలని భావిస్తోంది.



# జీవన్ రెడ్డి నిర్ణయం సరికాదు...

మొదటిపేజీ తరువాయి

ఉన్న చిన్నపాటి విభేదాల కారణంగా పార్టీని వీడటం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. దశాబ్దాల పాటు కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై అలుపెరగని పోరాటం చేసిన జీవన్ రెడ్డి, ఇప్పుడు అదే కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధపడటం చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి చర్యలు ఆయన రాజకీయ స్థాయికి తగవని, నవ్వుల పాలు కావద్దని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఎల్లప్పుడూ సముచిత గౌరవం ఇచ్చిందని, కీలక బాధ్యతలు అప్పగించిందని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వ్యక్తిగత అసంతృప్తి కంటే పార్టీ సిద్ధాంతాలే ముఖ్యమని, ఇన్నేళ్ల రాజకీయ అనుబంధాన్ని తెంచుకోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నారు. పార్టీ వీడినప్పటికీ ఆయనపై తమకు వ్యక్తిగత గౌరవం ఉందని, అయితే ఇప్పటికైనా తన నిర్ణయంపై పునరాలోచించుకోవాలని ఆయన కోరారు. ఒకవేళ జీవన్ రెడ్డి తన మనసు మార్చుకుని వెనక్కి తగ్గితే అది ఆయన రాజకీయ భవిష్యత్తుకు, పార్టీకి మేలు చేస్తుందని అన్నారు. రాజకీయాల్లో ఆవేశం కంటే ఆలోచన ముఖ్యమని, ఆయన తప్పుడు దారిలో వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# మైక్రో ఫైనాన్స్ మోసం కేసులో మంగ్లీ

మొదటిపేజీ తరువాయి

గాయని మంగ్లీతో పాటు మరో నలుగురిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చినప్పటికీ, ప్రస్తుతం పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. పెట్టుబడుల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించి మోసం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

ఫిర్యాదు ప్రకారం, మైక్రో ఫైనాన్స్ స్కీమ్‌స్‌లో అధిక లాభాలు వస్తాయని చెప్పి ప్రజలను ఆకర్షించినట్లు తెలుస్తోంది. ఈ పథకాలలో పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలో భారీ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు రూ.9.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివ, రమావత్ మధుపాల్ అలియాస్ భరత్ చౌహాన్, శైలజా చౌహాన్ తదితరులు పాల్గొన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ నిధులను "గోకులానందన ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" అనే సంస్థ పేరుతో సేకరించినట్లు సమాచారం. ఇంపోర్ట్‌ఎక్స్‌పోర్ట్, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ రంగాల్లో పెట్టుబడులు పెడతామని చెప్పి డబ్బులు తీసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ నమ్మకంతో పలువురు పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. హేమకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తిరుమల్ తదితరులు కూడా ఈ మోసానికి గురైన వారిలో ఉన్నారని సమాచారం. బాధితులు ఈ వ్యవహారాన్ని తేల్చేందుకు తార్నాక ప్రాంతానికి చెందిన న్యాయవాది సింగపోగు సుబ్బారావును సంప్రదించారు. ఆయన ఈ విషయంపై మంగ్లీని సంప్రదించగా, అనుచితంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ కేసులో తన పేరును, తన సోదరుడి పేరును చేర్చకుండా ఉండేందుకు డబ్బు ఆఫర్ చేసినట్లు కూడా ఆరోపించారు.

ఈ వ్యవహారంపై చర్చించేందుకు పంజాగుట్టలో ఒక సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ సమావేశంలో దర్శకుడు వేణు ఊడుగుల, అడ్వకేట్ పూజారి నాగేశ్వరరావు, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి తదితరులు పాల్గొన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు వేయకుండా ఉండాలని, మీడియా వద్ద ఉన్న వీడియోలను తొలగించాలని ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ సమావేశం అనంతరం పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. దర్శకుడు వేణు ఊడుగుల బెదిరింపులకు దిగగా, మంగ్లీ అసభ్య పదజాలంతో దూషించి ప్రాణహాని కలిగించేలా హెచ్చరించినట్లు ఆరోపించారు. అదే విధంగా రమావత్ మధు, శివ ఫోన్ ద్వారా కూడా బెదిరించినట్లు పేర్కొన్నారు. దీంతో తన ప్రాణాలకు ముప్పు ఉందని భావించిన సుబ్బారావు పోలీసులను ఆశ్రయించారు.

పోలీసులు ఫిర్యాదును స్వీకరించి బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 352 కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసులో పాల్గొన్న వారిపై వివరాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిధుల సేకరణ, లావాదేవీలు, బాధితుల వాంగ్మూలాలు వంటి అంశాలపై అధికారులు దృష్టిసారించారు.ఈ ఘటనతో మైక్రో ఫైనాన్స్ పేరుతో జరుగుతున్న మోసాలపై మళ్లీ చర్చ మొదలైంది. అధిక లాభాల పేరుతో ప్రజలను మోసం చేసే ఇలాంటి పథకాల పట్ల జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఈ కేసు ఎంతవరకు నిజమో, ఆరోపణల్లో ఎంత వాస్తవం ఉందో దర్యాప్తు పూర్తయ్యాకే స్పష్టత రానుంది.

# రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు

మొదటిపేజీ తరువాయి

ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం న్యాయానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపు ఉన్నప్పటికీ, అక్రమంగా చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు సాగలేదని అన్నారు.

ముఖ్యంగా 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రేవంత్ రెడ్డి భారీ భూ దందాకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అదే భూముల్లో కొత్త నగరాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క, సీతక్క వంటి నేతలు పాదయాత్రలు చేసి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు అదనంగా మరో 16,000 ఎకరాలను సేకరించాలని చూడటం వెనుక రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరుల ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఉన్న సిటీలో దోమల నివారణ కూడా చేయలేని ప్రభుత్వం, ఫ్యూచరే లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతామంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

ఇక నిషేధిత భూముల జాబితాను (22A) అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత భూముల సంఖ్యను ఏకంగా కోటి ఎకరాలకు పెంచి, భూ యజమానులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేస్తూ భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు పెచ్చుమీరాయని, హోటళ్లు, బార్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలకు అండగా ఉంటామని, నిబంధనలు అతిక్రమించి కాంగ్రెస్‌కు వత్తాసు పలికే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.





# దళారులను నమ్మి మోసపోవద్దు

- జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ .

**బోథ్, ఏప్రిల్ 11-డిడి 9వార్త) :**

నెరడిగొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో నిర్వహించిన నాఫెడ్ వారిచే తెలంగాణ రాష్ట్ర మార్క్ఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ కుమారి మరియు ప్రజామిత్ర జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని వారికి సహకరించాలని అన్నారు. ఎంతో కష్టపడి పండించే పంటలు తక్కువ ధరలకు అమ్మితే నష్టపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# బిసి ఎస్ సి ఎస్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి బాపూలే జయంతి వేడుకలు

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**
**(డిడి 9 వార్త న్యూస్ )**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడా మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు బిసి,ఎస్సీ,ఎస్టీసంఘాలఆధ్వర్యంలోపండుగ వాతావరణంలో వారి చిత్ర పాటలకు పూల మాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు . ఈ సందర్భంగా సామాజిక న్యాయం, విద్య మరియు సమానత్వం కోసం పూలే చేసిన కృషిని నాయకులు కొనియాడారు. నేటి వేడుకలకు జరిగాయి కుల వివక్షకు వ్యతిరేకంగా, మహిళా విద్య కోసం పూలే దంపతులు చేసిన పోరాటాన్ని నాయకులు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా డి ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి అన్నెలా లక్ష్మణ్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలేకు దేశ అత్యున్నత పురస్కారం 'భారత రత్న' ప్రకటించాలి. బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం మరిన్ని గురుకుల పాఠశాలలు మరియు విదేశీ విద్యా నిధిని పెంచాలి. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు 33% రిజర్వేషన్లు కల్పించాలి. ఈ జయంతి వేడుకలు కేవలం ఉత్సవాలుగా మాత్రమే కాకుండా, అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటానికి ఒక వేదికగా నిలిచాయి. అన్నారు ఈ కార్యక్రమం అన్ని వర్గాల నాయకులు పాల్గొన్నారు.




# మహిళా చైతన్యంతోనే నవ సమాజ నిర్మాణం

- పూలే విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం ఘన నివాళి

**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

సమాజం అభ్యున్నతి పథంలో పయనాలంటే మహిళా చైతన్యమే ప్రధానమని దాదాపు రెండు శతాబ్దాల క్రితమే గుర్తించిన గొప్ప దార్శనికుడు మహాత్మ జ్యోతిబాపూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్ కొనియాడారు. పూలే 200వ జయంతిని పురస్కరించుకుని నిజామాబాద్ నగరం హనుమాన్ జంక్షన్ వినాయక్ నగర్ వద్ద గల పూలే విగ్రహానికి సంఘం నాయకులు శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. పూలే కేవలం బడుగు, బలహీన వర్గాలకే పరిమితం కాకుండా సమాజంలోని వెనుకబడిన ప్రతి ఒక్కరి కోసం పోరాడిన అసాధారణ నాయకుడని ప్రశంసించారు. అగ్రవర్ణాల్లోని పేదలు, వితంతువుల అభ్యున్నతితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇలా ప్రతి కులం, ప్రతి జాతి సంక్షేమం కోసం ఆయన అహర్నిశలూ శ్రమించారని గుర్తుచేశారు. ముఖ్యంగా స్త్రీ విద్య ప్రాధాన్యతను గుర్తించి తన భార్య సావిత్రిబాయి పూలేకు స్వయంగా విద్యను నేర్పించి, ఆమెను దేశపు ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విద్యతోనే మహిళా చైతన్యం సాధ్యమని, మహిళలు బాగు పడితేనే కుటుంబం బాగుపడుతుందని నమ్మిన ఆయన ఆశయాలు నేటికీ ఆచరణీయమని పేర్కొన్నారు. భారతదేశానికే ఒక గొప్ప వరంగా నిలిచిన పూలే అడుగుజాడల్లో నడవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, కరిపే రవిందర్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, పోల్కం గంగాకిషన్, శ్రీలత, సత్యప్రకాష్, చంద్రకాంత్, కోడూరు స్వామి, సాయిబసవ, నరసయ్య, బాలన్న, తోట రాజశేఖర్, లక్ష్మణ్ గౌడ్, వాసం జయ, అపర్ణ, రేఖ, రుక్మిణి, సత్యనారాయణ, సురేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# హామీలు చాలానే... నియామకాలు ఎప్పుడూ?

- నామినేటెడ్ పదవుల పంపకాలపై నిరంతర వాయిదాలు
- "అదిగో ఇదిగో" అంటూ గడువు పెడుతున్నారనే విమర్శ
- పదవులు వస్తాయో లేదో కూడా స్పష్టత లేకపోవడం
- వారం, పది రోజుల్లో ఇస్తామని చెప్పి రెండేళ్లు ఆలస్యం
- జిల్లాల వారీగా ఇన్చార్జిలతో జాబితాలు సిద్ధం
- అయినప్పటికీ భర్తీ మాత్రం పెండింగ్‌లోనే
- 16–17 కార్పొరేషన్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

అదిగో ఇదిగో అంటున్నారు. అంతలోనే వాయిదా వేస్తున్నారు. ఎందుకు పోస్ట్‌పోన్ చేస్తున్నారో‌...అసలు పదవులు వస్తాయో ..లేదో కూడా అర్థంకాని పరిస్థితి. ఇంతకీ పదవుల పంపకాలు ఎక్కడ ఆగుతున్నాయి..ఎందుకు ఆపుతున్నారు.. !? నామినేటెడ్ పదవులు ఆశించిన చాలామంది నేతలు ఇప్పుడు నిర్వేదంలో ఉన్నారు. అదిగో ఇదిగో అని చెప్పడమే తప్పితే పదవులు వచ్చేది లేదు పోయేది లేదు అంటూ చెప్పుకుంటున్నారు. పార్టీ నాయకత్వం వారం పది రోజుల్లో అంటూ రెండేళ్లు వాయిదా వేసుకుంటూ వచ్చారు. ఇప్పటికీ పార్టీ నేతలు చెబుతున్న గడువు వారం.. పది రోజులు. జాబితా అంతా సిద్ధం చేసినా ఎందుకు ఆగుతోందో...ఎక్కడ ఆగుతోందో అంతుచిక్కని ప్రశ్నగా మారుతోంది. ఇప్పటికే పదవులు భర్తీ చేసివుంటే రెండేళ్ల టర్మ్ కూడా ముగిసేది.

పార్టీ సమావేశాల్లోనే బహిరంగంగా సీఎం రేవంత్ రెడ్డి...నామినేటెడ్ పదవులు భర్తీ చేద్దాం...పార్టీ నుంచి జాబితా పంపించండి అంటూ స్టేట్మెంట్ చేశారు. ఆ తర్వాత పార్టీ నాయకత్వం ఇన్చార్జిలను నియమించి జిల్లాల వారీగా జాబితాలను కూడా సిద్ధం చేసింది. కానీ ఇప్పటికీ నామినేటెడ్ పోస్టుల భర్తీ పెండింగ్లోనే కొనసాగుతోంది. ఎందుకు..? ఏమిటి ? అనేది ఎవరికీ బోధపడ్డం లేదు. ఇటీవల పార్టీ కుల సంఘాలకు సంబంధించిన కార్పొరేషన్లను భర్తీ చేస్తామని చెప్పుకుంటూ వచ్చింది. 16 నుంచి 17 పోస్టులను భర్తీ చేస్తామంటూ స్పష్టం చేశారు. చెప్పి నెల గడిచినా అడుగు ముందుకు పడలేదు. ఇప్పుడు కొత్త గడువు.. వారం పది రోజులకు వచ్చింది. పదవులు ఇచ్చే ఆలోచన లేదా..? భర్తీ చేస్తే నాయకులకు నష్టమేంటని నేతలు విసుక్కునేదాకా సాగదీత వ్యవహారం వెళ్తోంది.

నామినేటెడ్ పోస్టులు అనేక దశల్లో ఫిల్టర్ అవుతూ కొలిక్కి వస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఇన్చార్జి మీనాక్షి నటరాజన్..మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చించిన తర్వాత పేర్లు ఫైనల్ అవుతున్నాయని తెలుస్తోంది. రెండు, మూడు పర్యాయాలు వీళ్లంతా సమావేశం కూడా అయ్యారు. అయితే ఈ కమిటీలో సమన్వయం లేకపోవడం వల్లనే వాయిదా పడుతుందన్న చర్చ కూడా నడుస్తోంది. పార్టీ చేసిన ప్రతిపాదనలో ఒకరికి నచ్చితే...ఇంకొకరికి నచ్చటం లేదని వాదన ఉంది. ఎమ్మెల్యేకు నచ్చితే మంత్రికి నచ్చడం లేదు...ఇద్దరికీ నచ్చిన వాళ్ళు నామినేటెడ్ పదవులను ఫైనల్ చేసే వాళ్లకు నచ్చటం లేదని అభిప్రాయం ఆశావాల్లో నెలకొని ఉంది. నిజంగానే నాయకుల మధ్య సమన్వయం ఉంటే ఇన్నాళ్లు ఇది వాయిదా పడుతూ వచ్చేది కాదు అనేది ఓపెన్ టాక్.

ఇప్పటి వరకు 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. ఆ కార్పొరేషన్లలో డైరెక్టర్లను భర్తీ చేసినా చాలామంది నాయకులు సంతోష పడేవారు. వాటిని కూడా భర్తీ చేయడం లేదు.. ఒకట్రెండు నెలల్లో ఆ కార్పొరేషన్ చైర్మన్ల పదవి కూడా ముగుస్తుంది. క్షేత్రస్థాయిలో క్యాడర్ కూడా కొంత అసంతృప్తితో కనపడుతోంది. పనులు అవ్వడం లేదన్న ఆగ్రహంతో వుంది. మరోవైపు నాయకులకేమో పదవులు రాక బీపీ రైజ్ అవుతోంది. ఎదురుచూసి..ఎదురుచూసి...విసుగు చెందిన తర్వాత పదవి వచ్చినా...సదరు నాయకుల్లో ఆ జోష్ సగం సచ్చిపోయి



# అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు

- ఐలాపూర్‌లో భారీ కూల్చివేతలు
- ప్రభుత్వ భూ రక్షణకు భారీ ఆపరేషన్
- కోర్టు ఆదేశాలను పక్కనపెట్టి చర్యలు
- గెస్ట్ హౌస్, ఆరు అంతస్తుల భవనం నేలమట్టం
- ఘర్షణలు నివారించేందుకు భారీ పోలీసు బందోబస్తు
- పేదల ఇళ్లకు హాని లేకుండా జాగ్రత్తలు
- వేల కోట్ల విలువైన భూముల పరిరక్షణ లక్ష్యం
- భూకబ్జాలపై కమిషనర్ రంగనాథ్ వివరణ
- కూల్చివేతలపై స్థానికుల ఆనందం, మద్దతు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ప్రభుత్వ భూములను కాపాడే చర్యల్లో భాగంగా హైడ్రా అధికారులు మరోసారి పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ ప్రాంతంలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన పలు భవనాలను అధికారులు బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. రెవెన్యూ, పురపాలక శాఖలతో కలిసి సమన్వయంగా ఈ చర్యలు చేపట్టిన హైడ్రా, ప్రభుత్వ స్థలాల్లో జరిగిన అక్రమ నిర్మాణాలను తొలగించడంలో కఠినంగా వ్యవహరిస్తోంది.

ఈ చర్యలలో భాగంగా కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌తో పాటు ఆరు అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. చాలా కాలంగా ఈ నిర్మాణాలపై వివాదం కొనసాగుతున్నప్పటికీ, ఇటీవల వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి చర్యలు ప్రారంభించారు. కోర్టు స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలు కొనసాగించడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు.కూల్చివేతల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ అధికారులు పరిస్థితిని అదుపులో ఉంచారు. ముందస్తు జాగ్రత్తలతో ప్రజలను దూరంగా ఉంచి కూల్చివేతలు నిర్వహించారు. స్థానికంగా ఉద్రిక్తతలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఈ ఆపరేషన్‌లో ముఖ్యంగా పేదల నివాసాలను దెబ్బతీయకుండా జాగ్రత్తలు తీసుకోవడం విశేషం. ఇప్పటికే నివాసాలు ఏర్పడిన ప్రాంతాలను వదిలి, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను మాత్రమే స్వాధీనం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఉన్న తండాలు, పేదల ఇళ్లపై ఎలాంటి ప్రభావం పడకుండా ముందుగానే ప్రణాళిక సిద్ధం చేశారు.ఐలాపూర్ ప్రాంతంలో సుమారు 1200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో పెద్ద భాగం ఇప్పటికే ఆక్రమణకు గురైనప్పటికీ, మిగిలిన భూమిని రక్షించేందుకు హైడ్రా చర్యలు వేగవంతం చేసింది. ఈ భూముల విలువ వేల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అందువల్ల భవిష్యత్తులో మరిన్ని ఆక్రమణలు జరగకుండా




ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నారు.

అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తుల భవనంపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మొదట ఖాళీగా ఉన్న ఈ భవనాన్ని కూల్చివేతల సమయంలో నివాసాలున్నట్లుగా చూపేందుకు కొంతమందిని అద్దెకు తీసుకువచ్చినట్లు గుర్తించారు. వారిని బయటకు పంపించి భవనాన్ని పూర్తిగా కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.ఈ కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ, కోర్టు ఎక్కడా కూల్చివేతలను ఆపాలని చెప్పలేదని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం తప్పుదోవ పట్టించేలా ఉందని అన్నారు. గతంలోనే ఈ భూములపై స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని ఉల్లంఘిస్తూ పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయని తెలిపారు. కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించి కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. కూల్చివేతలపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు. తమకు ఇబ్బందులు కలిగించిన అక్రమ ఆక్రమణలు తొలగించడంపై ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కొందరు కాలనీ వాసులు ఆనందంతో సంబరాలు కూడా నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.మొత్తంగా ఈ ఆపరేషన్ ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా కట్టుబడి ఉందనే సంకేతం ఇచ్చింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# బషీరాబాద్‌లో పూలే జయంతి వేడుకలు

**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బైకన్ జమున మహేష్, ఉప సర్పంచ్ చిలివేరి భూమేశ్వర్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్య కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బి.రాజు, జె.శ్రీనివాస్, ఏ.శేఖర్, డి.రవి, సదర్ లింగన్న, శంకర్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి

- నర్సాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

సమాజం ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రగతి సాధ్యమని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నర్సాపూర్ గ్రామ సర్పంచ్ బుసాపురం సంధ్య రాజశేఖర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కమ్మర్‌పల్లి మండలం చౌటీపల్లి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నర్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 30 ఏళ్లు పైబడిన వారికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మంచి ఆహారపు అలవాట్లే మనిషిని ఆరోగ్యవంతుడిగా ఉంచుతాయని పేర్కొన్నారు. అనంతరం ఉప సర్పంచ్ కట్ట రాజ్ కుమార్ మాట్లాడుతూ.. రోగులు వైద్యులు సూచించిన మేరకు మాత్రమే మందులు వాడాలని, మోతాదుకు మించి వాడితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ఈ శిబిరంలో సుమారు 40 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి దుర్గా రాణి, ఏఎన్ఎం అమృత, కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రెటరీ పోడెండ్ల సంజీవ్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ధర్పల్లి రాకేష్, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.






# మత్తు వీడండి.. నవ జీవితాన్ని ప్రారంభించండి

- **జీజీహెచ్‌లో డి-అడిక్షన్ చికిత్స కేంద్రం ప్రారంభం**
- **వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీపీ సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

యువత మత్తు పదార్థాల బారిన పడకుండా విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో పెరగాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆకాంక్షించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన డ్రగ్స్ విముక్తి చికిత్స కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పిల్లలు వ్యసనాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం అవగాహన కల్పించాలని కోరారు. ఆల్కహాల్‌ను ఏ రూపంలో తీసుకున్నా అది చట్టరీత్యా నేరమని, డ్రగ్ ప్రివెన్షన్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం డ్రగ్స్ నివారణపై నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఫార్మసీ, మెడికల్ కళాశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు తమ కుటుంబ సభ్యులు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోనే ఈ చికిత్స కేంద్రం అందుబాటులోకి రావడం వల్ల బాధితులకు సకాలంలో వైద్యం అందించి, వారిని తిరిగి ఆరోగ్యవంతులుగా మార్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ నాగమోహన్, పీఓఎన్‌సీడీ డాక్టర్ వెంకన్న, సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, శ్రీలత, నర్సింగ్ సూపరింటెండెంట్ చంద్రకళతో పాటు మెడికల్, నర్సింగ్ కళాశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# మద్యం మత్తులో స్టీరింగ్ పడితే జైలుకే

- **రెండు వారాల్లో 338 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు**
- **రూ. 25.75 లక్షల జరిమానా.. 34 మందికి జైలు శిక్ష**
- **నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడి**



**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఉక్కుపాదం మోపుతోంది. గడిచిన రెండు వారాల్లో కమిషనరేట్ పరిధిలోని లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో భారీగా కేసులు నమోదయ్యాయి. మార్చి 30 నుండి ఏప్రిల్ 11 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 338 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టుల్లో హాజరుపరచగా న్యాయస్థానం 34 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడమే కాకుండా, మిగిలిన వారికి కలిపి మొత్తం రూ. 25,75,000 భారీ జరిమానా విధించిందని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ వాహనదారులకు పలు కీలక సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలను వివరిస్తూ.. పట్టుబడిన వారి లైసెన్స్‌లను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం మత్తులో ప్రమాదాలు జరిగితే సంబంధిత ఇన్సూరెన్స్ కూడా లభించదని స్పష్టం చేశారు. ముఖ్యంగా మైనర్లు తాగి వాహనాలు నడిపితే, సదరు మైనర్లతో పాటు వాహన యజమానులపై కూడా ఛార్జ్ షీట్ నమోదు చేసి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకటి కంటే ఎక్కువసార్లు పట్టుబడిన వారికి కఠినమైన జైలు శిక్ష తప్పదని పేర్కొన్నారు. మోటార్ వెహికల్ యాక్ట్ 2019 సవరణ ప్రకారం.. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొదటిసారి దొరికితే రూ.10 వేలు జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారని, రెండోసారి పట్టుబడితే జరిమానా రూ. 15 వేలకు పెరగడంతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందని వివరించారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు తమ వెంట పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు.





# మందుల వినియోగంపై అప్రమత్తత అవసరం : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

మందులను బాధ్యతాయుతంగా వాడాలని, ముఖ్యంగా అలవాటుగా మారే మందులు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగం ఆరోగ్యానికి చేటని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మరియు ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో మందుల దుర్వినియోగంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థులు, ఆరోగ్య రంగ భాగస్వాములు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. ఎల్లమ్మ గుట్టలోని కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ భవన్‌లో జరిగిన సదస్సులో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు పలు కీలక అంశాలను వివరించారు. షెడ్యూల్ H2 మందుల కోసం క్యూఆర్ కోడ్ వెరిఫికేషన్ పాటించాలని, మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలను క్యూఆర్ కోడ్ ద్వారా రిపోర్ట్ చేయవచ్చని తెలిపారు. నకిలీ మందులపై ఫిర్యాదుల కోసం 18005996969 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు వాడకూడదని ఈ సందర్భంగా ఫార్మసిస్టులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. సుమారు 150 మంది ఫార్మసీ విద్యార్థులు, కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా కెమిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల మధుసూదన్, కార్యదర్శి బి. సుధాకర్, కోశాధికారి సాయులుతో పాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి. శ్రీకాంత్, ఆర్. శ్రీలత ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజశ్రీ, ఈగిల్ టీమ్ సీఐ పూర్ణచందర్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వెంకన్న, విజయ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.






# ప్రభుత్వ ఆసుపత్రిలో పటిష్ట బందోబస్తు

- **భద్రతా ఏర్పాట్లపై సీపీ సాయి చైతన్య సమీక్ష**
- **ఆత్మహత్యల నివారణ, అక్రమ పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి**

**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు, సిబ్బందికి మరింత మెరుగైన భద్రత కల్పించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు. శనివారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ నెలకొన్న భద్రతా పరమైన సమస్యలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీఎంఅండ్‌హెచ్‌ఓతో కలిసి సుదీర్ఘంగా సమీక్షించారు. గతంలో ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఆత్మహత్యల ఘటనలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ఆసుపత్రి ప్రాంగణమంతా నిరంతరం నిఘా నీడలో ఉండేలా సీసీ కెమెరాల ఏర్పాటు, పటిష్టమైన బందోబస్తుపై సవివరంగా చర్చించారు. ఆసుపత్రిలో గతంలో జరిగిన శిశువుల అపహరణ ఉదంతాలను ప్రస్తావిస్తూ అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని సీపీ ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలోని షెడ్ల కింద ఆశ్రయం పొందుతున్న అనాథల మృతికి సంబంధించిన అంశాలు, బయటి వ్యక్తులు ఆసుపత్రి పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలిపి వెళ్తున్న తీరును ఆయన పరిశీలించారు. అనధికార పార్కింగ్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి వెలుపల ఉన్న దుకాణాల వల్ల అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని సూపరింటెండెంట్ సీపీ దృష్టికి తీసుకురాగా, దీనిపై తక్షణమే స్పందించిన ఆయన ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో ఆసుపత్రి యంత్రాంగం, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పిట్ట గుడ్ల కోసం వెళ్లి కుంటలో మునిగి వ్యక్తి మృతి

**బీర్కూర్, ఏప్రిల్ 11(డిడి9 వార్త):**

మండల పరిధిలోని రైతునగర్ గ్రామానికి చెందిన మద్దేల్వర్ శ్రీనివాస్ (36) అనే వ్యక్తి దురదృష్టవశాత్తు కుంటలో మునిగి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, శ్రీనివాస్ పిట్ట గుడ్ల కోసం చించోలి గ్రామంలోని తూర్కొల్ల కుంట వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో కుంటలోకి దిగిన ఆయన, లోతైన ప్రదేశంలోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయినట్లు తెలుస్తోంది.ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బీర్కూర్ ఎస్.ఐ వి.కె. రాములు తెలిపారు. ఘటనపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.



# సాలూరలో ఘనంగా పూలే జయంతి వేడుకలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

మండల కేంద్రమైన సాలూర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సొక్కం లావణ్య రవి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి, మహిళా సాధికారతకు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు బయ్యన్ సురేష్, మంచాల్వార్ రవి, గ్రామస్తులు సొక్కం రవి, కల్లూరి భాస్కర్, సంగేపు ముకుంద్, పంచాయతీ సిబ్బంది విజయ్ పటేల్, శివ, సతీష్, శంకర్, లక్ష్మణ్, రాము, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టిసన్లుగా గుర్తించాలని కొనసాగుతున్న నిరవధిక సమ్మె

- **ఎండల లక్ష్మీనారాయణ సంఘీభావం**

**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఆర్టిసన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. నిజామాబాద్ పవర్ హౌస్ వద్ద కార్మికులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ హాజరై కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ప్రధానంగా ఆరు కీలక డిమాండ్లపై ఈ పోరాటాన్ని సాగిస్తున్నారు. ఏపీ సబ్ రూల్స్ అమలు చేయాలని, కన్వర్షన్ ప్రక్రియ పూర్తి చేయాలని, సెలవులకు సంబంధించి ఎన్‌క్యాష్‌మెంట్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అలాగే పీసీడీఓ కార్మికులను మరియు మిగిలిన క్యాజువల్ లేబర్లను ఆర్టిసన్లుగా గుర్తించి తగిన గౌరవం కల్పించాలని నినదించారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని కార్మికులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్ల మోహన్, బామని శివ, బట్టు గంగాధర్, తిరుపతితో పాటు సుమారు 300 మందికి పైగా కార్మికులు పాల్గొన్నారు.






## సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్ నేతృత్వంలో పూలే జయంతి.

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 11(డి డి 9వార్త ):-**

బోథ్ గ్రామపంచాయతీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే గారి జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ నాయకులు పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, విద్యా హక్కులు, సామాజిక న్యాయం కోసం మహాత్మా పూలే గారు చేసిన సేవలు అపారమని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్. మాట్లాడుతూ, పూలే గారి ఆశయాలను అమలు చేయడం ద్వారా మాత్రమే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో EO అంజయ్య, ఉపసర్పంచ్ విజయలక్ష్మి , వార్డ్ సభ్యులు కర్పే శ్రీనివాస్ గారు మహాత్మా పూలే గారికి వినమ్ర నివాళులు అర్పించారు. నాయకులు సన్నీ రెడ్డి ,ప్రవీణ్ ,అలాగే గ్రామపంచాయతీ సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం, విద్యా విస్తరణ కోసం కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. మహాత్మా పూలే గారి ఆశయాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణలో ఉండాలని పిలుపునిచ్చారు.





## గ్రామాల్లో ధాన్యపు కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

బోధన్ మండలంలోని వివిధ గ్రామాల్లో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు శనివారం ప్రారంభమయ్యాయి. రైతు బాంధవులు, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు పెంటాకుర్దు, పెగడపల్లి, అమ్దాపూర్, ఎరాజ్ పల్లి, మరియు కల్దుర్కి గ్రామాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోకుండా, మద్దతు ధర పొందేలా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవాల్లో నాయకులు మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. సుదర్శన్ రెడ్డి సూచనల మేరకు ఎక్కడా జాప్యం జరగకుండా సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల మేరకు ఎండబెట్టి, నాణ్యతా ప్రమాణాలతో కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.




## భాజపా కార్యకర్తకు ప్రకాష్ రెడ్డి పరామర్శ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

సాలూర మండలంలోని తగ్గేల్లి గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్త వీరేశంను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన వీరేశం గురించి తెలుసుకున్న ఆయన, నేరుగా బాధితుని నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరేశంకు ధైర్యం చెబుతూ.. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల అధ్యక్షులు గంగాధర్, నాయకులు ప్రకాష్, రాజు, ప్రవీణ్ లు పాల్గొన్నారు.







# ఉత్నూర్‌లో వైభవంగా పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం

**కామారెడ్డి జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

సదాశివనగర్ మండల ఉత్నూర్ గ్రామంలో శ్రీ శ్రీశ్రీ పెద్దమ్మ తల్లి పరివార దేవతా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. చైత్ర మాస నవమిని పురస్కరించుకుని గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక ఉత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం 7 గంటల నుంచే ఆలయంలో బ్రాహ్మణ ఆహ్వానం, స్వస్తి పుణ్యాహవచనం, ధ్వజారోహణంతో వేడుకలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. అనంతరం ముఖ్యదేవతా పూజ, అగ్నిప్రతిష్ఠ, హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ పెదద్దిరాజుల కళ్యాణ మహోత్సవాన్ని మధ్యాహ్నం 12:25 గంటలకు అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున కన్నులపండువగా జరిపించారు. మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ కళ్యాణ వేడుకను భక్తులు తన్మయత్వంతో వీక్షించారు. అనంతరం భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం వేళ మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలతో ఉత్నూర్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముదిరాజ్ సంఘం ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.







## డ్వాక్రా మహిళా సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- **కోడిచేర్ల గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్ ఐ సయ్యద్ హుస్సేన్**

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 11(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పొడంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో ఈరోజు డ్వాక్రా మహిళా సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మొండి కవిత ఇర్వంత్ ఆధ్వర్యంలో ప్రారంభం చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ మొండె కవిత ఇర్వంత్ వారు మాట్లాడుతూ ఈసారి కోతలు త్వరగా రావడం జరిగింది. వర్షాలు రాకముందే రెండు గ్యాంగులు తయారు చేయడం జరిగింది రైతులు నష్టపోకుండా దళారుల చేతుల పోకుండా ప్రభుత్వానికి అమ్మే విధంగా రైతులకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొండి కవిత ఇర్వంత్ ఉప సర్పంచ్ కోటగిరి గంగారాం డ్వాక్రా గ్రూప్ సీసీ నాగలక్ష్మి డ్వాక్రా గ్రూప్ గ్రామ అధ్యక్షురాలు పోషవ్వ డ్వాక్రా గ్రూప్ కార్యదర్శి బాలమణి డ్వాక్రా గ్రూపు సి ఏ శిరీష గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు గంట శ్రీకాంత్ రాజు. బిర్లా కేశవ్ బిరుగొండ. గ్రామ ప్రజలు రైతులు రైతులు పాల్గొన్నారు




## మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు విడుదల

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

తెలంగాణ ఆదర్శ పాఠశాల (Model School) ప్రవేశ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్ వెల్లడించారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ అయిన www.tgms.telangana.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ప్రవేశ పరీక్షలు ఈ నెల 19వ తేదీ (ఆదివారం) గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో నిర్వహించబడనున్నాయి. 6వ తరగతి: ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు 7వ తరగతి నుండి 10వ తరగతి (మిగిలిన సీట్లు): మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే సమయంలో తప్పనిసరిగా హాల్ టికెట్ మరియు అవసరమైన గుర్తింపు పత్రాలు వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

**నిజామాబాద్ జిల్లా 11 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే డిమాండ్ సామాజిక న్యాయ పోరాటంలో భాగంగా పుట్టుకొచ్చిందని, ఇది రాజ్యాంగ విలువల పరిరక్షణకు సంబంధించిన అంశమని భీంగల్ వేదికగా పాస్టర్ అసోసియేషన్ గళమెత్తింది. భీంగల్‌లో నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ, మతం మారినంత మాత్రాన పుట్టుకతో వచ్చిన కులం మారిపోదని, సామాజిక వివక్ష ఎదుర్కొంటున్న దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు నిరాకరించడం వివక్షాపూరితమని ధ్వజమెత్తారు. 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వు దళితుల మధ్య మతపరమైన విభజన రేఖను గీసిందని, ఇది రాజ్యాంగంలోని 25వ అధికరణం కల్పించిన మత స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కులం అనేది సామాజిక వాస్తవమని, మతం అనేది వ్యక్తిగత విశ్వాసమని పేర్కొన్న నాయకులు, దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న అణచివేతను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల పక్షాన నిలబడి పోరాడుతున్న మందకృష్ణ మాదిగ, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి నాయకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అయితే, దళిత వర్గాల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కీలక అంశంపై మౌనం వహించడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. రంగనాథ్ మిశ్రా కమిషన్ వంటి సంస్థలు ఎస్సీ హోదాను మతాతీతం చేయాలని సిఫార్సు చేసినా, పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వల్ల లక్షలాది మంది దళిత క్రైస్తవులు విద్య, ఉద్యోగాల్లో వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, హక్కుల సాధన కోసం ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని చెబుతూనే, కేంద్రం ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీంగల్ మండల పాస్టర్ అసోసియేషన్ బాధ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



## నిరుపేద కుటుంబ వివాహానికి ఆర్థిక సాయం

- **బిజెపి నాయకుడు ప్రకాష్ పటేల్**

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 11(డీడీ9 వార్త ):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన గైని శివవ్వ కుమార్తె అయిన సంధ్య వివాహం రేపు ఉదయం జరగనుంది. విషయం తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గ సీనియర్ నాయకులు మర్కేలి ప్రకాష్ పటేల్ గారు పెండ్లి కానుకగా 3000/ రూపాయల విలువగల నిత్య అవసర సరుకులను అందించి పెండ్లి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు నేరొల్ల శంకర్, సీనియర్ నాయకులు గంధపు మోహన్, ఒమన్న పటేల్, మేదరి రాములు, దండు వంశీ, నేరెళ్ల గంగారం, నేరెళ్ల సాయమ్మ, రమేష్ , నాగేష్ , రాజు తదితరులు పాల్గొన్నారు



## లెక్కలేనన్ని గంటలు కష్టపడినప్పటికీ ఇలా జరగడం చాలా బాధను కలిగిస్తోంది..

దళపతి విజయ్ ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు ముందే లీక్ అవ్వడం ఇప్పుడు భారతీయ చిత్ర పరిశ్రమలో పెను సంచలనంగా మారింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన పూజా హెగ్డే, ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్‌ను షేర్ చేస్తూ, పైరసీని ప్రోత్సహించవద్దని ప్రేక్షకులను కోరారు. మూవీ విడుదలకు ముందే లీక్ అవ్వడం తనను ఎంతగానో కలచివేసిందని పూజా పేర్కొన్నారు. "ఒక సినిమా వెనుక వేలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కష్టం, త్యాగాలు ఉంటాయి. ప్రతిరోజూ మీకు ఒక మంచి అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో మేమంతా పని చేస్తాం. లెక్కలేనన్ని గంటలు కష్టపడినప్పటికీ ఇలా జరగడం చాలా బాధను కలిగిస్తోంది. సినిమా ఇలా అక్రమంగా ఆన్‌లైన్‌లో లీక్ అవ్వడం చూసి షాక్ అయ్యా. ఇది కేవలం వసూళ్ల గురించి కాదు, ఒక కళాకారుడికి దక్కాల్సిన గౌరవం గురించి," అని ఆమె రాసుకొచ్చారు.

విజయ్ సర్ ఆఖరి చిత్రాన్ని మనమందరం కలిసి థియేటర్లలో పెద్ద తెరపై సెలబ్రేట్ చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె గుర్తు చేశారు. "మనం సినిమాను సరైన పద్ధతిలోనే చూద్దాం. పైరసీని ప్రోత్సహించకండి. అప్పుడే మూవీ అనే కళ బతుకుతుంది. కొన్నాళ్ళు వేచి ఉండండి, సినిమా సరైన సమయంలో థియేటర్లలోకి వస్తుంది," అని పూజా హెగ్డే ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. కేవలం పూజా హెగ్డే మాత్రమే కాదు, రజనీకాంత్, చిరంజీవి, సూర్య, శివకార్తికేయన్ వంటి స్టార్ హీరోలు కూడా ఈ లీక్‌ను తీవ్రంగా ఖండించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, చిత్ర నిర్మాణ సంస్థ కూడా ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించింది. సినిమా క్లిప్పులను లేదా పూర్తి చిత్రాన్ని షేర్ చేసే వారిపై సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో బాబీ డియోల్, మమితా బైజు, ప్రియమణి కీలక పాత్రలో నటించారు. కానీ సెన్సార్ కారణంగా విడుదల వాయిదా పడుతూ వస్తుంది.



## విడుదలైన 15 రోజులకే ఓటీటీలోకి 'యూత్'..

తమిళంలో ఘనవిజయం సాధించి, తెలుగులోనూ మంచి ఆదరణ పొందిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'యూత్' (Youth) ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ (Netflix) ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా... ఈ చిత్రం ఏప్రిల్ 16, 2026 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కెన్ కరుణాస్ ఈ చిత్రంలో కథ నాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహించగా.. అనీషా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షీ యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మార్చి 19న తమిళంలో, మార్చి 27న తెలుగులో థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది ఈ చిత్రం.



ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక మధ్యతరగతి టీనేజర్ తన స్కూల్, కాలేజ్ రోజుల్లో ప్రేమ కోసం చేసే ప్రయత్నాలు, ఎదుర్కొన్న అవమానాలు మరియు బ్రేకప్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒక యువకుడు తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాల నుండి ఎలా పరిణతి చెందాడు అనే అంశాన్ని దర్శకుడు వినోదాత్మకంగా, భావోద్వేగ పూరితంగా తెరకెక్కించారు.

## వెండితెరకు మరో వారసుడు.. జయప్రద తనయుడు సామ్రాట్ గ్రాండ్ ఎంట్రీ!

సినీ పరిశ్రమలో వారసుల ఎంట్రీ ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. తాజాగా ఈ జాబితాలోకి సీనియర్ నటి జయప్రద కుమారుడు సామ్రాట్ చేరుతున్నారు. గత కొంతకాలంగా సామ్రాట్ హీరోగా ఎంట్రీ ఇస్తారనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. సామ్రాట్‌ను టాలీవుడ్‌కు పరిచయం చేసే బాధ్యతను ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ తీసుకుంది. భారీ బడ్జెట్‌తో, పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా కోసం ఇప్పటికే సామ్రాట్ నటనలో, ఫైట్స్, డాన్స్‌లలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు సమాచారం.

ఈ భారీ లాంచింగ్ మూవీ కోసం చిత్ర యూనిట్ ప్రస్తుతం ఒక స్టార్ హీరోయిన్ (Top Heroine) కోసం చూస్తోంది. సామ్రాట్ సరసన నటించేందుకు టాలీవుడ్‌లోని ఒక టాప్ హీరోయిన్ అయితేనే సినిమాకు పాన్‌ఇండియా అప్పీల్ వస్తుందని జయప్రద భావిస్తున్నారట. ఈ మేరకు ఇద్దరు ముగ్గురు స్టార్ హీరోయిన్లతో చర్చలు కూడా జరుగుతున్నట్లు ఫిలిం నగర్ టాక్. తన కుమారుడి డెబ్యూ కోసం జయప్రద స్వయంగా కథా చర్చల్లో పాల్గొనడమే కాకుండా, టెక్నికల్ టీం విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది. దీంతో సామ్రాట్ తన తల్లికి తగ్గట్టుగా వెండితెరపై ఎలాంటి



మ్యాజిక్ చేస్తాడో చూడాలని సినిమా ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## ఆ బాధ నేనూ అనుభవించా

సినిమా లీక్ అయితే ఎంత బాధగా ఉంటుందో తనకు తెలుసని విజయ్ దేవరకొండ ఆవేదన వ్యక్తంచేశారు. కెరీర్ ప్రారంభంలో తాను కూడా ఆ బాధను అనుభవించినట్లు చెప్పారు. కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు ముందే సోషల్ మీడియాలో లీక్ అయిన విషయం తెలిసిందే. దీనిపై పలువురు ప్రముఖులు ఆందోళనతో వరుస పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా విజయ్ దేవరకొండ ఈ లీక్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు.

''ఇలాంటివి జరిగినప్పుడు కలిగే బాధ వర్ణణాతీతం. వ్యక్తిగతంగా నేను కూడా అనుభవించా. మనల్ని లక్ష్యంగా చేసుకున్నట్లు అనిపిస్తుంది. ఆశ కోల్పోతాం. నేను నా గురించి మాత్రమే చెప్పట్లేదు.. అందరి తరఫున మాట్లాడుతున్నా. సినిమా అనేది ఎంతోమంది కలలు కన్న ప్రపంచం. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలి. దీని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించాలి. అలా జరగకపోతే, అది వ్యవస్థాగత వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుంది. మనుషులు కొంచెం కూడా మనసు లేకుండా ఎలా ఉంటారో అర్థంకావడం లేదు. కొందరు ఏమాత్రం ఆలోచించకుండా పక్కవారికి హాని చేయడానికి ఎంతకైనా దిగజారుతారని ఈ లీక్ మనకు గుర్తుచేస్తోంది. 'జననాయగన్' చిత్రబృందానికి మద్దతు తెలుపుతున్నా'' అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**ఆమోదయోగ్యం కాదు..**

'జననాయగన్' లీక్ ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వరుణ్ తేజ్ అన్నారు. విడుదల కాని కంటెంట్‌ను లీక్ చేయడం వినోదం కాదని, అది దొంగతనంతో సమానమన్నారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కంటెంట్‌ను షేర్ చేయొద్దని నెటిజన్‌లకు విజ్ఞప్తి చేశారు.

## ఓటీటీలోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'..

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీని స్ట్రీమింగ్‌కు సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు.

కథేంటంటే..: నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగు పెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు? అన్నది చిత్ర కథ.



## బేషరతుగా రణ్‌వీర్ సింగ్ క్షమాపణ

'కాంతార' చిత్రంలో దైవ పాత్రను అవమానించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న తాను పరిష్కృత క్షమాపణ పత్రాన్ని దాఖలు చేస్తానని బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ కర్ణాటక హైకోర్టుకు ప్రమాణపత్రాన్ని సమర్పించారు. రణ్‌వీర్ ఇప్పటికే దాఖలు చేసిన క్షమాపణ లేఖలో పశ్చాత్తాపం లేదని, ఫిర్యాదు చేయడమే తప్పు అన్నట్లు ఉందని అర్జీదారుని తరఫు న్యాయవాది వాదించారు. బెంగళూరు హైగ్రౌండ్స్ ఠాణాలో నమోదైన కేసును రద్దు చేయాలని రణ్‌వీర్ దాఖలు చేసిన అర్జీపై జస్టిస్ ఎం.నాగప్రసన్న విచారణ కొనసాగించారు. ఇప్పటికే రణ్‌వీర్ దాఖలు చేసిన ప్రమాణపత్రం, క్షమాపణల పత్రంలోని అంశాలను న్యాయమూర్తి ముందు చదివి వినిపించారు. ఈ నెల 18న మైసూరులోని చాముండేశ్వరి బెట్టకు కూడా రణ్‌వీర్ వస్తున్నారని తెలిపారు.

అర్జీదారుడు, అతని న్యాయవాదితో చర్చించి, వారికి తృప్తి కలిగించే భాషలో పరిష్కృత ప్రమాణ పత్రాన్ని దాఖలు చేస్తామని రణ్‌వీర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేశారు. 'ఘటన జరిగిన రోజు తాను దైవాన్ని, భక్తుల భావనల్ని దెబ్బతీశానని నేను అర్థం చేసుకోలేకపోయాను. నేను ముంబయిలో సింధీ కుటుంబంలో జన్మించి ఉండడంతో అందులోని ఘనతను అర్థం చేసుకోలేకపోయాను. ఈ ప్రమాణపత్రం ద్వారా నేను తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. నేను నిజాయతీగా, బేషరతుగా క్షమాపణలు కోరుతున్నాను. రానున్న రోజుల్లో మైసూరు దేవాలయానికి వచ్చి ప్రార్థన చేసి, నా భక్తిని వ్యక్తం చేస్తాను' అని రణ్‌వీర్ దాఖలు చేసిన ప్రమాణపత్రంలో ఉందని న్యాయవాదులు తెలిపారు.



## అందుకే 'జన నాయగన్' లీక్: కమల్ హాసన్ పోస్ట్

ప్రస్తుతం ఇండస్ట్రీలో 'జననాయగన్' లీక్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై అగ్రహీరోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విడుదల కూడా కాకముందే సినిమా లీక్ కావడంతో అటు దర్శకనిర్మాతలు కూడా షాక్ అయ్యారు. వెంటనే పైరసీని ఆన్‌లైన్ నుంచి తొలగించాలని లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. లీక్ అయిన సన్నివేశాలను షేర్ చేయడం కూడా చట్టపరమైన నేరమేనని ఎవరూ షేర్ చేయొద్దంటూ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రీలోని ప్రముఖులు దీనిపై వరుస పోస్ట్‌లు పెడుతున్నారు. సినిమా దురదృష్టవశాత్తూ లీక్ కావడం తననెంతో ఆందోళనకు గురి చేసిందని చిరంజీవి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో స్టార్ హీరో కమల్‌హాసన్ పోస్ట్ వైరల్‌గా మారింది. సెన్సార్ జాప్యం వల్లే సినిమా లీక్ అయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

''జననాయగన్ సినిమా లీక్ అవడం అనుకోకుండా జరిగిన విషయం కాదు. ఇది వ్యవస్థ వైఫల్య ఫలితం. దీని పనులు సకాలంలో జరిగిఉంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు. సెన్సార్‌బోర్డులో జరిగిన విపరీతమైన జాప్యం పైరసీకి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. పైరసీ రాజకీయాలకు అతీతమైనది. అది కళపై, కళాకారుడి పైన చేసే దాడి. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కృషిని ప్రమాదంలో పడేస్తుంది. అలాగే మనం ప్రేమించే సినిమాను నిలబెడుతున్న వాళ్లపై, నిజాయతీగా పన్ను చెల్లిస్తున్న నిర్మాతలు, థియేటర్ యజమానులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. వ్యవస్థ విఫలమైనప్పుడు సినిమాను ఎవరు కాపాడతారు? విడుదల విషయంలో చట్టపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు విచారణ వేగవంతం చేయాలి. గతంలో మీరు నాకు అండగా నిలిచినట్లే, నిజమైన సినిమా ప్రేమికులు ఇప్పుడు కూడా ఏకమవ్వండి. ఈ చిత్రాన్ని థియేటర్లలోనే చూద్దాం. దానికి సహకరించండి'' అని కమల్ హాసన్ అన్నారు. ''సినిమా లీక్ అయిందని తెలిసి షాక్ అయ్యాను. చాలా బాధగా ఉంది. దీనికి కారణమైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి'' అని రజనీకాంత్ ఆవేదన వ్యక్తంచేశారు.




## ది ప్యారడైజ్ నుంచి అదిరిపోయే సర్‌ప్రైజ్..

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాపై అంచనాలు ఏ రేంజ్‌లో ఉన్నాయో అందరికీ తెలిసిందే. 'దసరా' వంటి ఊర మాస్ హిట్టు తర్వాత వీరిద్దరూ కలిసి చేస్తున్న ప్రాజెక్ట్ కావడంతో, నాని ఈసారి ఎలాంటి విధ్వంసం సృష్టిస్తాడో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ యాక్షన్ డ్రామాకు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటం సినిమాకు మరింత ప్లస్ అయ్యింది. గత కొద్ది రోజులుగా ఈ సినిమాలో నాని సరసన ఎవరు నటిస్తున్నారు అనే విషయంపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. మలయాళ ముద్దుగుమ్మ కయ్యదు లోహర్ ఈ ప్రాజెక్టులో ఉందని వార్తలు వచ్చినప్పటికీ, చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో అభిమానులు అయోమయంలో పడిపోయారు. ఈక్రమంలో.. తాజాగా నాని ఈ సస్పెన్స్‌కు తెరదించుతూ ఫ్యాన్స్‌కు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు.

ఏప్రిల్ 11కయ్యదు లోహర్ పుట్టినరోజు.. సందర్భంగా నాని ఆమెకు విషెస్ తెలుపుతూ సినిమాలో ఆమె చేస్తున్న పాత్రను పరిచయం చేశారు. ఈ చిత్రంలో కయ్యదు సుబ్బలక్ష్మి అనే పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడిస్తూ ఆమెకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక విడుదలైన పోస్టర్‌లో కయ్యదు లోహర్ పక్కా పల్లెటూరి అమ్మాయిలా కనిపిస్తోంది. తెల్లటి షర్ట్, స్కై బ్లూ కలర్ లంగా ధరించి సైకిల్‌పై వెళ్తూ.. కనిపించి అందరిలో క్యూరియాసిటీని పెంచుతోంది. ముఖ్యంగా ఆ సైకిల్‌కు ఉన్న ఒక బ్యాగ్ చూస్తుంటే, కథలో ఆమె పాత్ర చాలా కీలకంగా ఉండబోతోందని అర్థమవుతోంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ ఇంటెన్స్ డ్రామా ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో విడుదల కానుంది. ఇక ఇందులో టాలీవుడ్ స్టార్ హీరో మోహన్ బాబు కూడా కీలక పాత్రలో కనిపించనుండటం విశేషం.

